

# అట్టహాసంగా.. పారాలింపిక్స్

**పారిస్ విశ్వక్రీడలు ఘనంగా ప్రారంభం • అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు • పతాకధారులుగా సుమిత్, భాగ్యశ్రీ**

పారిస్: ఫ్యాషన్ నగరి పారిస్‌లో మరో ప్రపంచ క్రీడా సంబరానికి అట్టహాసంగా తెర లేచింది. గతానికి పూర్తి భిన్నంగా పారిస్ నడిబొడ్డున జరిగిన పారాలింపిక్స్ ఆరంభ వేడుకలు అభిమానులను కట్టిపడేశాయి. భారత కాలమానం ప్రకారం రాత్రి 11.30లకు మొదలైన కార్యక్రమాలు ఆసాంతం అందరినీ అలరించాయి. తమ దేశ ఘనమైన వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెబుతూ కార్యక్రమాల రూపకల్పన చేశారు. ప్రముఖ అర్టిస్టిక్ డైరెక్టర్ థామస్ జాలీ సారథ్యంలో పారాలింపిక్స్ ప్రారంభ వేడుకలను తీర్చిదిద్దారు. చాంప్స్ ఎలీస్ నుంచి మొదలైన ఓపెనింగ్ సెర్మనీ..ప్యాలెస్ డీ లా కాన్‌కోర్డ్ వరకు సాగింది. గత సంప్రదాయలకు భిన్నంగా స్టేడియం లోపల కాకుండా ఈసారి ఆరుబయట ప్రేక్షకుల సమక్షంలో అథ్లెట్ల పరేడ్ కొనసాగింది. తొలుత ఫ్రాన్స్ పారా అథ్లెట్లు 'వెల్‌కమ్ టు పారిస్' అంటూ వివిధ దేశాల అథ్లెట్లకు సాదర స్వాగతం పలికారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమాన్యుల్ మక్రాన్, అంతర్జాతీయ పారాలింపిక్ కమిటీ అధ్యక్షుడు అండ్రూ పార్సన్స్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. పారాలింపిక్స్ మస్కట్ పిర్జీ బొమ్మలతో అందంగా తీర్చిదిద్దిన కారులో దిగ్గజ ఫుట్‌బాలర్ జినేదిన్ జిదాన్‌తో పాటు స్విమ్మర్ థియో కురిన్ ప్రధాన వేదిక వద్దకు చేరుకున్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికి ఫ్రాన్స్ వాయుసేన ఆధ్వర్యంలో తమ దేశ జాతీయ పతాక రంగుల్లో ఆకాశంలో చేసిన విన్యాసం కట్టిపడేసింది.

**అఫ్గానిస్థాన్‌తో మొదలై:**

ఫ్రాన్స్ అక్షర్ క్రమాన్ని అనుసరిస్తూ తొలుత పారా అథ్లెట్ల పరేడ్ అఫ్గానిస్థాన్‌తో మొదలైంది. ఆ తర్వాత దక్షిణాఫ్రికా జట్టు వరుస క్రమాన్ని అనసరించింది. సుమిత్ అంటిల్, భాగ్యశ్రీ జాదవ్..జాతీయ పతాక ధారులుగా వ్యవహరించారు.





## డేవిడ్ మలన్ రిటైర్మెంట్



లండన్: ఇంగ్లండ్ ఆటగాడు డేవిడ్ మలన్ అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఓపెనర్‌గా మెరుపులు మెరిపించిన మలన్ మంగళవారం ఓ బ్రిటీష్ పేపర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించాడు. 36 ఏండ్ల మలన్ తన కెరీర్‌లో 22 టెస్టులు (1,074 పరుగులు), 30 వన్డేలు (1,450), 62 టీ20లు (1,892) ఆడాడు. పొట్టి ఫార్మాట్‌లో మెరుపులు మెరిపించిన మలన్ 2020లో కొన్ని వారాల పాటు ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానాన్ని దక్కించుకున్నాడు. 2022లో టీ20 ప్రపంచకప్ గెలిచిన ఇంగ్లండ్ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు.

## శ్రీజేష్ వారసుడిగా పాఠక్

ఢిల్లీ: సుమారు రెండు దశాబ్దాల పాటు భారత హాకీ జట్టుకు గోల్ కీపర్‌గా సేవలందించి ఇటీవలే ఆటకు వీడ్కోలు పలికిన పీఆర్ శ్రీజేష్ స్థానాన్ని క్రిషన్ బహదూర్ పాఠక్ భర్తీ చేయనున్నాడు. సెప్టెంబర్ 8 నుంచి 17 దాకా చైనా వేదికగా జరుగబోయే ఆసియా చాంపియన్స్ ట్రోఫీ కోసం ప్రకటించిన 18 మంది జట్టు సభ్యులలో గోల్‌కీపర్‌గా పాఠక్ ఎంపికయ్యాడు. శ్రీజేష్ స్థానాన్ని పాఠక్.. ఏ మేరకు భర్తీ చేస్తాడనేది ఆసక్తికరంగా మారింది.

# అల్కారజ్, సిన్నర్ శుభారంభం

**టాప్ సీడ్ల ముందంజ**

**తొలి రౌండ్‌లోనే ఎమ్మా రదుకాను ఔట్**



న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో టాప్ సీడ్ ఆటగాళ్లు కార్లోస్ అల్కారజ్ (స్పెయిన్), జన్నిక్ సిన్నర్ (ఇటలీ), డేనియల్ మెద్వెదెవ్ శుభారంభం చేశారు. పురుషుల సింగిల్స్‌లో మూడో సీడ్ అల్కారజ్ 6-2, 4-6, 6-3, 6-1తో లి టు (ఆస్ట్రేలియా)ను ఓడించాడు. తొలి సెట్‌ను అలవోకగానే గెలుచుకున్న అల్కారజ్ రెండో సెట్‌లో తడబడ్డా తర్వాత పుంజుకున్నాడు. ఈ విజయంతో అతడు గ్రాండ్‌స్లామ్ ఈవెంట్స్‌లో 60వ విజయం నమోదు చేసుకున్నాడు. ఇటీవల డోపింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒకటో సీడ్ సిన్నర్.. 2-6, 6-2, 6-1, 6-2తో మాకీ మెక్‌డొనాల్డ్ (యూఎస్‌ఏ)ను మట్టికరిపించాడు. రష్యన్ ఆటగాడు మెద్వెదెవ్ 6-3, 3-6, 6-3, 6-1తో డుసాన్ లెజొవిచ్ (సెర్బియా)ను ఓడించి రెండో రౌండ్‌కు దూసుకెళ్లాడు. 'గ్రీకు' వీరుడు స్టెఫనోస్ సిట్సిపస్ తొలి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టాడు.

**రదుకాను ఔట్:**

మహిళల సింగిల్స్‌లో 2021 చాంపియన్ ఎమ్మా రదుకాను (బ్రిటన్) 1-6, 6-3, 4-6తో సోఫియా కెనిన్ (అమెరికా) చేతిలో ఓటమిపాలై తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. మాజీ యూఎస్ చాంపియన్ నవోమి ఒసాకా 6-3, 6-2తో ఒస్టపెంకో(లాట్వియ)పై అలవోకగా గెలిచింది. మహిళల టెన్నిస్‌లో నంబర్‌వన్, టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలండ్) 6-4, 7-6 (8/6)తో కమిల్ల రఖిమొవా(రష్యా)పై నెగ్గింది. వీరితో పాటు వొజ్నియాకి (డెన్మార్క్), ఆండ్రీవా (రష్యా), జాస్మిన్ పలోని (ఇటలీ) రెండో రౌండ్‌కు అర్హత సాధించారు.

## 5 గంటల 35 నిమిషాల హోరాహోరీ

**యూఎస్ ఓపెన్‌లో సరికొత్త రికార్డు**



యూఎస్ ఓపెన్ చరిత్రలో మంగళవారం అత్యంత సుదీర్ఘమైన మ్యాచ్ జరిగింది. కరెన్ కచనోవ్ (రష్యా), డాన్ ఎవాన్స్ (బ్రిటన్) మధ్య హోరాహోరీగా జరిగిన పోరు ఏకంగా 5 గంటల 35 నిమిషాల పాటు కొనసాగింది. టెన్నిస్ ఓపెన్ ఎరాలో భాగంగా 1970 నుంచి యూఎస్ ఓపెన్‌లో ఇంత సుదీర్ఘమైన మ్యాచ్ జరగడం ఇదే మొదటిసారి. గతంలో స్టీఫన్ ఎడ్‌బర్గ్, మైఖేల్ చాంగ్ మధ్య 1992లో జరిగిన సెమీస్ మ్యాచ్ 5 గంటల 26 నిమిషాల పాటు సాగగా తాజాగా ఆ రికార్డు బద్దలైంది. కాగా తాజా పోరులో ఎవాన్స్ 6-7 (6/8), 7-6 (7/2), 7-6 (7/4), 4-6, 6-4తో కరెన్‌ను ఓడించాడు. మూడు టై బ్రేకర్‌లు జరిగిన ఈ మ్యాచ్‌లో ఐదు సెట్లలో (68 నిమిషాలు, 67, 72, 67, 61) ఏ ఒక్క సెట్ కూడా గంట కంటే తక్కువ జరుగకపోవడం గమనార్హం.

# లక్నో మెంటార్‌గా జహీర్



కోల్‌కతా: భారత క్రికెట్ దిగ్గజం, మాజీ బౌలర్ జహీర్ ఖాన్ ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్‌ఎస్‌జీ) ఫ్రాంచైజీకి మెంటార్‌గా నియమితుడయ్యాడు. ఈ మేరకు ఎల్‌ఎస్‌జీ బుధవారం అధికారికంగా ఈ విషయాన్ని వెల్లడించింది. కోల్‌కతాలో జరిగిన ఓ కార్యక్రమంలో లక్నో ఫ్రాంచైజీ యజమాని సంజీవ్ గోయెంకా.. జహీర్‌కు జెర్సీని అందజేస్తూ జట్టులోకి ఆహ్వానించారు. అంతకుముందే ఎల్‌ఎస్‌జీ 'ఎక్స్' ఖాతాలో ఈ విషయాన్ని తెలిపింది. 2022, 2023 సీజన్లలో గౌతం గంభీర్ లక్నోకు మెంటార్‌గా పనిచేయగా 2024లో అతడు కోల్‌కతా నైట్ రైడర్స్‌కు వెళ్లి అటు నుంచి నేరుగా భారత క్రికెట్ జట్టుకు హెడ్‌కోచ్ అయ్యాడు. లక్నో మెంటార్‌తో పాటు ఆ జట్టు బౌలింగ్ బాధ్యతలనూ జహీర్ చూసుకోనున్నాడు. లాన్స్ క్లూసెనర్, ఆడమ్ వోగ్స్ అసిస్టెంట్ కోచ్‌లుగా ఉండనున్నారు.

# విండీస్ క్లీన్‌స్వీప్

**3-0తో సిరీస్ సొంతం**



ట్రినిడాడ్: కొద్దిరోజుల క్రితమే స్వదేశంలో ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన వెస్టిండీస్.. సొంతగడ్డపై దక్షిణాఫ్రికాను చిత్తుగా ఓడించింది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసింది. మంగళవారం జరిగిన మూడో టీ20లో సఫారీలను 8 వికెట్ల తేడాతో ఓడించి సిరీస్‌ను 3-0తో గెలుచుకుంది. వర్షం కారణంగా 13 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 4 వికెట్ల నష్టానికి 108 పరుగులు చేసింది. ట్రిస్టన్ స్టబ్స్ (40) ధాటిగా ఆడాడు. విండీస్ లక్ష్యాన్ని 13 ఓవర్లలో 116 పరుగులుగా నిర్దేశించగా షై హోప్ (42 నాటౌట్), నికోలస్ పూరన్ (35) వేగంగా ఆడి 9.2 ఓవర్లలోనే గెలుపు లాంఛనాన్ని పూర్తిచేశారు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.